
భల్లూకాలు భయపెడుతున్నాయి..



మందస: మండలంలోని అల్లిమెరక గ్రామస్తులను భల్లూకాలు(ఎలుగుబంట్లు) భయపెడుతున్నాయి. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మూడు ఎలుగుబంట్లు శుక్రవారం రాత్రి హల్‌చల్ చేశాయి. దీంతో గ్రామస్తులు ఏ క్షణాన ఏం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ముగిసిన జిల్లాస్థాయి పోరు

ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోరు ముగిసింది. విజేతలకు బహుమతులు అందించారు.

- 8లో

అపోటా సమావేశం రేపు

కంచిలి: కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) సర్వసాధారణ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో ఒడియా విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

న్యూస్‌రీల్

బీఈడీ, డీపీఈడీ, బీపీఈడీ గుర్తింపునకు ఆమోదం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న 13 బీఈడీ, మూడు డీపీఈడీ, ఒక బీపీఈడీ కళాశాలల గుర్తింపునకు శుక్రవారం ఆమోదం తెలిపారు. నిబంధనలకు లోబడి అభ్యంతరాలు ఉన్న ఒక బీఎడ్ కళాశాలను మాత్రం గుర్తింపు నుంచి మినహాయించారు. గుర్తింపు ఉన్న కళాశాలల్లో ప్రవేశాలకు ఇబ్బంది ఉండదు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అమరావతిలోని ఉన్నత విద్యా మండలి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ అధికారులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, పాలక మండలి సభ్యురాలు ప్రొఫెసర్ పీలా సుజాత, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్‌లతో శుక్రవారం వర్చువల్‌గా ఆన్‌లైన్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కళాశాల అఫిలియేషన్ కమిటీలు తనిఖీలు, నిర్వహణ విధానం, వారు సమర్పించిన డాక్యుమెంట్లు వంటి వాటిపై సమీక్షించారు. అనంతరం అర్హత ఉన్న కళాశాలలకు గుర్తింపు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు కళ్యాణ్‌రామ్



కళ్యాణ్‌రామ్‌తో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జేసీ ఎం.నవీన్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్‌గేమ్స్ అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేటకు చెందిన పి.కళ్యాణ్‌రామ్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 5 నుంచి చత్తీస్‌గఢ్ వేదికగా జరగనున్న ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలురు జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ పోటీల కోసం శుక్రవారం ఇక్కడ నుంచి పయనమయ్యాడు. కళ్యాణ్‌రామ్‌ను ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జేసీ ఎం.నవీన్ అభినందించారు. ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, స్కూల్ గేమ్స్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా నాయకులు కలిదిండి నరసింహరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



సుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చల్ల ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సుడా (శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వైస్ చైర్మన్‌గా చల్ల ఓబులేసు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ తన పరిధిలోగల అన్ని రకాల పనులను పూర్తి చేసి విధిగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. మళ్లీ శ్రీకాకుళం జిల్లా ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం రావడం అదృష్టమన్నారు.

'మార్పులు, చేర్పుల్లో జాగ్రత్త అవసరం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు జాగ్రత్తగా పరిశీలించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఆయన శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ప్రత్యేకంగా 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫారాలు, ఎస్ఎస్ఆర్-2024 సమయంలో స్వీకరించిన ఫారాలు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, 2024-సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల భద్రత, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫైనల్ పబ్లికేషన్ అయిన తర్వాత వివిధ రకాల ఫారాలు అందుతున్నట్లు చెప్పారు. ఫైనల్ పబ్లికేషన్ తర్వాత వచ్చిన దరఖాస్తులపై మాట్లాడుతూ పరిశీలన జరపకుండా ఏ దరఖాస్తునూ అప్రూవ్ చేయకూడదన్నారు.

జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల తుది జాబితా తర్వాత కూడా వచ్చిన దరఖాస్తుల గురించి వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు.

• సర్కారు విజయానికి సాక్షి

ఆడపడుచుల ఆనందానికి ఆసరా వేదికవుతోంది. వారి అనుభవాలతో ఆ వేదిక వేడుకవుతోంది. మారిన బతుకులు, ఆగిన కన్నీళ్లు, గమనించిన మార్పులను ఆసరా సంబరాలు ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తున్నాయి. 'అన్న'మాట ప్రకారం రుణమాఫీ డబ్బును నేరుగా ఖాతాలకు జమ చేయడం, ఆ డబ్బును జీవనోపాధికి ఉపయోగించుకోవడం సర్కారు సాధించిన విజయానికి సాక్షిగా కనిపిస్తోంది.

– నరసన్నపేట, కొత్తూరు



కొత్తూరులోని ఆసరా సంబరాల్లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొమనాపల్లిలో జరిగిన ఆసరా సంబరాల్లో పాల్గొన్న స్వయం శక్తి సంఘాల మహిళలు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

విపక్షాలను నమ్మవద్దు

టీడీపీ నాయకుల మాటలు నమ్మితే మన సంక్షేమాలన్నీ ఆగిపోతాయి. పాదయాత్రలో ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశారు.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

మీరే మా బలం

ఆడపడుచులే జగనన్నకు అండాదండ. ఆయనను మళ్లీ సీఎం చేసే బాధ్యత సోదరీమణులందరిపైనా ఉంది. చంద్రబాబు మన జిల్లాకు చేసిందేమీ లేదు. జన్మభూమి కమిటీలతో ఆయన చేసిన దోపిడీ ఎవరూ మర్చిపోలేదు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

సత్యవరంలో ప్రగతి సంబరం

• సత్యవరంలో సంక్షేమ ఫలాలు • స్పష్టంగా కనిపిస్తున్న మార్పు • అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం



గ్రామంలో ఒకే చోట ఉన్న సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలు

ఒకప్పుడు మండల కేంద్రానికి పరుగులు పెడితే గానీ జరగని పనులు.. ఇప్పుడు ఊరిలోనే రూ.40 లక్షలతో కట్టిన సచివాలయంలో సులభంగా జరుగుతున్నాయి.

ఒకనాడు గంటల తరబడి లైన్లలో నించుంటే గానీ దొరకని విత్తనాలు, ఎరువులు.. ఇప్పుడు ఆ ఊరిలోనే రూ.22 లక్షలతో కట్టిన రైతు భరోసా కేంద్రం వద్ద ఏ కష్టం లేకుండా దొరుకుతున్నాయి.

వేకువన కుళాయి వద్ద గొడవపడితే గానీ నిండని బిందె.. నేడు ఏ వాదనా లేకుండా ఇంటి వద్దనే నిండుతోంది. ఇలా ఇంటికి కుళాయిలు వచ్చాయి. ఊరికి దారులు పడ్డాయి. బడులకు భవనాలు వచ్చాయి. వీధులకు కాలువలు ఏర్పాటయ్యాయి. సత్యవరం అనే చిన్న ఊరు ఈ మార్పులకు ప్రత్యక్ష సాక్షి.

నరసన్నపేట:

నరసన్నపేటకు అతి దగ్గరలో ఉన్న గ్రామం సత్యవరం. సత్యవరాగ్రహారంగా ఎంతో పేరున్న ఈ గ్రామం పండితులు పురోహితులకు నిలయం. జనాభా 2332 మంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చేంతవరకు ఇది అన్ని గ్రామాల్లాగానే సాదాసీదా గ్రామం. రహదారులు లేక ఇబ్బంది పడడం, అరకొర మౌలిక వసతులతో నెట్టుకురావడం, మంచినీటికి కటకటలాడడం, ప్రభుత్వ పాఠశాలల్లో భవనాలు లేకపోవడం వంటి అన్ని సమస్యలు ఉండేవి. కానీ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో సత్యవరం అనేక మార్పులను చూసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనినీ సద్వినియోగం చేసుకుని ఆదర్శవంతంగా కనిపిస్తోంది.



అభివృద్ధి పనుల్లో కొన్ని..

• ఊరిలో అన్న దాతల కోసం రూ.22 లక్షలతో ఆర్‌బీకే నిర్మించి అన్ని అవసరాలు తీరుస్తున్నారు.

• జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఉన్న 800 ఇళ్లకూ కుళాయిలు వేశారు. నేరుగా ఇంటికే ఇప్పుడు నీరు వస్తోంది.

• నాడు-నేడు పథకంలో భాగంగా గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నోచుకున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో పనులు పూర్తి కాగా జిల్లా పరిషత్ స్కూల్‌లో పనులు చివరి దశలో ఉన్నాయి.



కొత్తగా వేసిన ప్రధాన రహదారి

• గ్రామంలోనే వెల్‌నెస్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి అత్యవసర రక్త పరీక్షలన్నీ నిర్వహిస్తున్నారు.

• అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు మంజూరు చేశారు. 75మందికి సొంత స్థలాల్లో ఇళ్లు మంజూరు చేయగా.. స్థలాలు లేని 16 మందికి గడ్డెయ్యపేట వద్ద స్థలాలు ఇచ్చారు.

• రూ.40 లక్షలతో సచివాలయ భవనం నిర్మించారు. అన్ని సేవలు స్వగ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి.



ప్రాథమిక పాఠశాలలో కొత్త భవనాలు

• ఎస్ఆర్ఈజీఎస్, మండల పరిషత్, గడపగడపకూ నిధులు రూ.30 లక్షలతో రోడ్లు నిర్మించారు. అలాగే పీఎంజీఎస్‌వై నిధులు రూ.రెండు కోట్లతో ప్రధాన రహదారి(ఎస్‌హెచ్16 నుంచి గ్రామం చివరి వరకూ) పక్కాగా నిర్మాణం జరిగింది.

• మండల పరిషత్, గడపగడపకూ నిధులు రూ. 11 లక్షలతో సీసీ డ్రైన్ల నిర్మాణం చేపట్టారు.

• డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 15.59 కోట్లు పంపిణీ చేశారు.

ఆసరా, చేయూతతో వ్యాపారం



మా కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వ్యాపారానికి పెట్టుబడి లభించింది. చేయూత పథకంలో రూ. 18,750 చొప్పున మూడు సార్లు వచ్చింది. అలాగే ఆసరా ద్వారా రూ. 9,700 చొప్పున నాలుగు మార్లు డబ్బు వచ్చింది. వీటిని వ్యాపారానికి పెట్టుబడిగా వినియోగించుకున్నా. వీటికి తోడు డ్వాక్రాలో రుణం వాడుకున్నాను. పావలా వడ్డీ అమలవుతోంది. బయట మూడు రూపాయల వడ్డీకి తీసుకున్న అప్పు తీర్చేశాను. మిగిలిన డబ్బుతో ఇప్పుడు ఉన్నంతలో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాను. కుటుంబానికి తోడుగా ఉంటున్నా.

– గంటేటి మంగమ్మ, కాలనీ, సత్యవరం

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



గడిచిన నాలుగున్నరేళ్లలో సత్యవరం ఎంతో మారింది. ముఖ్యమంత్రి అమలు చేసిన పథకాలతో మా గ్రామం బాగా లబ్ధి పొందింది. రోడ్లు, కాలువలు, స్కూల్స్ బాగుపడ్డాయి. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ ఆరంగి మురళీధర్‌ల కృషితో మరిన్ని పథకాలు వచ్చాయి. ప్రధాన రహదారి సుందరంగా తయారైంది. ఇక పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయి.

– సీర లక్ష్మీనారాయణ, పంచాయతీ వార్డు మెంబర్, సత్యవరం

మెరుగైన సేవలకు ప్రాధాన్యం

• శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా



శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా తమీమ్ అన్సారియా గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించి శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని, ముందుగా శ్రీకాకుళం నగరంపై పూర్తి అవగాహన కలిగిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామన్నారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. పారిశుద్ధ్యం, పార్కింగ్ సౌకర్యాలు, ప్రజా మరుగుదొడ్లు, పార్కులు తదితర సౌకర్యాలతో పాటు లైటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మున్సిపల్ ఆదాయం పెరిగేలా కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రణాళికా విభాగం మరింత మెరుగుపడేలా చూస్తామన్నారు. గతంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేసిన అనుభవంతో నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

గత అనుభవంతో ఉత్తమ సేవలు

2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తాను ఉత్తరప్రదేశ్‌లో పాఠశాల విద్య సహాయ కార్యదర్శిగా, లక్నోలో నేషనల్ హెల్త్‌మిషన్ అడిషనల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఫతేపూర్ జిల్లా చీఫ్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేసినట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి వచ్చిన తర్వాత శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశానని, ఈ అనుభవంతో శ్రీకాకుళం ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం



చర్చిస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

అరసవల్లి: ప్రఖ్యాత అరసవల్లి సూర్యక్షేత్రంలో ఈ నెల 16న రథసప్తమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ముఖ్యంగా సామాన్య భక్తుల దర్శనాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆలయ ట్రస్ట్ బోర్డు తీర్మానించింది. ఈ మేరకు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఉదయం జరిగిన పాలక మండలి సభ్యుల సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదం తెలియజేశారు. అలాగే రథసప్తమి ఆహ్వాన పత్రికలను శనివారం ఉదయం మంత్రి ధర్మాన ప్రసాదరావు అరసవల్లి ఆలయంలోనే ఆవిష్కరించనున్నారని సభ్యులు ప్రకటించారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, జె.శ్రీనివాస్, ఎల్.గోవిందరావు, ఎస్.కోటేశ్వర చౌదరి, దుక్క గనిరాజు, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ పాల్గొన్నారు. వీఐపీ టిక్కెట్లకు ప్రత్యేకంగా స్లాట్ టైమింగ్‌ను ఆ రోజున ఉదయం 7 గంటల నుంచి అమలు చేయాలని, దాతలకు కూడా సప్తమి అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే అనుమతించాలని, వీవీఐపీలను కూడా అరసవల్లి మిల్లు కూడలి నుంచి ఆలయ సింహ ద్వారం వరకు ప్రత్యేక వాహనాల్లోనే తీసుకురావాలని తీర్మానించారు.

ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష



ఆర్‌ఓలతో సమీక్షిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల నమోదు, తొలగింపుల్లో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఈఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. సాధారణ ఎన్నికల-2024 సన్నద్ధతపై ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లతో కలిసి ఎలక్టోరల్ అధికారులు, నోడల్ అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. నోడల్ అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, తదితరమైన వాటిపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి ఎలక్టోరల్‌పై తీసుకుంటున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గంపై ఆర్డీఓ డాక్టర్ ఎస్.భరత్ నాయక్ వివరించారు. స్వీప్‌కు సంబంధించి ఎన్ని సమావేశాలు నిర్వహించారో డీఆర్‌డీఏ పీడీని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ జీఆర్ రాధిక జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులపై కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓలు డాక్టర్ ఎస్.భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, నోడల్ అధికారులు డీపీఓ రవి కుమార్, జెడ్పీ సీఈఓ వెంకటరామన్, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, ఏపీసీ జయ ప్రకాష్, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలు నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఫోన్ నంబర్ 8247861919 కి సమస్యలు, సమాచారం కోసం సంప్రదించవచ్చు. వర్సిటీ అధికారులు పాల్గొని సమాధానం చెబుతారు.

మగ్గం వర్క్ 30 రోజుల శిక్షణకు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజులు మగ్గం వర్క్ శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 10వ తేదీ నుంచి బ్యాచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామని చెప్పారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని చెప్పారు. పూర్తి వివరాలకు ఫోన్‌నంబర్లు 9553410809, 7993340407 సంప్రదించాలని అన్నారు.

డీఆర్‌డీఏకు వితరణ



డీపీఎం నాగలక్ష్మికి రూ.50వేలు చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జనవరి 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ సిక్కోలు డ్వాక్రా బజారు నిర్వహించారు. ఇందుకు గాను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీకాకుళం రీజనల్ కార్యాలయం వారు డీఆర్‌డీఏకు రూ.50వేలు చెక్కును డీఆర్‌డీఏ డీపీఎం నాగలక్ష్మికి శుక్రవారం శ్రీకాకుళంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో వితరణగా అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్, చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, సర్వీసెస్ మురళీకృష్ణ, ఎల్‌డీఎం ఎం. సూర్యకిరణ్ తదితరులు ఉన్నారు.


వెటర్నరీ డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమక్షంలో రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెటర్నరీ డైరీని ఆవిష్కరించారు. పలాసలో మంత్రి స్వగృహం నందు కొత్త డైరీ, వాల్‌పోస్టర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా శాఖా కార్యాలయాల్లో పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గుంటూరు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం చైర్మన్‌లతో పాటు జోన్-01కు సంబంధించిన మూడు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎలుగు దాడి ప్రాంతంలో ఫారెస్ట్ అధికారుల పర్యటన



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: చీపురుపల్లి పంచాయతీ పరిధిలో గల ఎం.గడూరు, డెప్పూరు గ్రామాల్లో శుక్రవారం అటవీ శాఖాధికారులు పర్యటించారు. ఎలుగులు సంచరిస్తున్న పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు బాధిత గ్రామాల ప్రజలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎలుగుల సంచారం, రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.మురళీకృష్ణం నాయుడు మాట్లాడుతూ ఎలుగులు ఉదయం, సాయంత్రం వేళల్లో సంచరించే అవకాశం ఉన్నందున జీడి రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎలుగులు సంచరించే ప్రాంతాల్లో ఫారెస్ట్ బీట్,సెక్షన్ అధికారులు,సిబ్బందితో కూడిన మూడు బృందాలు గాలింపు చర్యలు చేపడతూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

సింగిల్ పేరెంట్ పిల్లలకు కిట్లు అందజేత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఉదయపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సింగిల్ పేరెంట్ పిల్లలకు కిట్లను పంపిణీ చేశారు. ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు జుత్తు పురుషోత్తం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ వంటి చదువుకు అవసరమైన వస్తువులతో కిట్లను అందించారు. ఏటా ఇలాంటి చిన్నారులకు కిట్లు అందించే కార్యక్రమం చేపడుతున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

● పట్టాల పంపిణీ



శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేట గ్రామానికి చెందిన నలభై కుటుంబాలకు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం పట్టాలను పంపిణీ చేశారు. పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. –శ్రీకాకుళం రూరల్

● గడపగడపకూ..



మండలంలోని తోలాపి గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. –పొందూరు

4న మహిళా డిగ్రీ కళాశాలలో 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం'

శ్రీకాకుళం న్యూకాలనీ:

శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘానికి అధ్యక్షులుగా డాక్టర్ ఎంఆర్ జ్యోతి ఫెడరిక్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఉమామహేశ్వరి, కార్యదర్శి ఎస్‌వీఎస్ పూర్ణిమ, విజయ్‌కుమారి, కోశాధికారి ఎం.చంద్రకుమారి, డాక్టర్ టి.స్వర్ణలత, వై.ప్రశాంతి కార్యవర్గ సభ్యులగా వ్యవహరించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ సూర్యచంద్ర కోరారు.

ముగిసిన జిల్లాస్థాయి పోరు

- జిల్లాలో ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన జేసీ ఎం.నవీన్



బ్యాడ్మింటన్ విన్నర్స్ పాతపట్నం జంటకు ట్రోఫీని అందజేస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోరు ముగిసింది. ఇక రాష్ట్రస్థాయి పోటీలే మిగిలి ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా జరిగిన జిల్లాస్థాయి పోరులో బుధ, గురువారం రెండు రోజులపాటు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. శుక్రవారం ఖోఖో, బ్యాడ్మింటన్(డబుల్స్) క్రీడాంశాల్లో పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ పోటీలు సాయంత్రంతో ముగిశాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. నాణ్యమైన భోజనంతోపాటు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి శభాష్ అనిపించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలుగా నిలిచిన జట్లకు/క్రీడాకారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ బహుమతులు అందజేశారు. ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన ఈ పోటీలతో లక్ష్యసాధన సాకారమైందన్నారు. రాష్ట్రపోటీల్లో శ్రీకాకుళం జిల్లాను విజయపథంలో నిలపాలని జేసీ ఆకాంక్షించారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు జిల్లాలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, ఒలింపిక్ సంఘ జిల్లా సలహాదారు పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, పీడీలు, శాప్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి విజేతల వివరాలు..

- ఖోఖో పురుషుల విభాగంలో విజేతగా పలాస, రన్నరప్‌గా ఎచ్చెర్ల, తృతీయ స్థానంలో ఇచ్ఛాపురం నియోజకవర్గాలు నిలిచాయి.
- ఖోఖో మహిళల విభాగంలో విజేతగా ఎచ్చెర్ల, ఆమదాలవలస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
- షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పురుషుల విభాగంలో పాతపట్నం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
- షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ మహిళల విభాగంలో విజేతగా ఇచ్ఛాపురం, రన్నరప్‌గా శ్రీకాకుళం, తృతీయస్థానంలో పాతపట్నం నియోజకవర్గాలు నిలిచాయి.

జగనన్న మహిళా మార్టుకు తొలి వసంతం



జగనన్న మహిళా మార్ట్ వద్ద మహిళలు, పీడీ కిరణ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమష్టి కృషితో అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని మహిళలు నిరూపించారని మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక రైతుబజార్ సమీపంలోని జగనన్న మహిళా మార్టులో తొలి ఏడాది వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కార్పొరేట్ వ్యాపారాలకు ధీటుగా జగనన్న మహిళా మార్టును స్వయం సహాయక సంఘాల మహిళలు సమష్టి కృషితో విజయవంతంగా నడపగలగడం గర్వించదగ్గ విషయమన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఇది శుభారంభమన్నారు. మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ప్రోత్సాహంతో ఇప్పటికే అన్ని పురపాలక సంఘాల్లో మహిళా శక్తిని ప్రోత్సహించే దిశగా పట్టణ ప్రగతి యూనిట్లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మున్ముందు అన్ని పురపాలక సంఘాల్లో మహిళా మార్టుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎస్‌వీ రమణ, అకౌంటెంట్ ఏ.వెంకటరావు, జిల్లా సిబ్బంది కె.వి.సత్యనారాయణ, ఎస్.వెంకటరావు, బి.రామారావు, వి.విజయలక్ష్మి, బి.భాస్కరరావు తదితర శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ సిటీ మిషన్ మేనేజర్ శారదావాణి, ఆమదాలవలస, పలాసా కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభం



రణస్థలంలో అంతర పంటలను పరిశీలిస్తున్న రాజస్థాన్ బృంద సభ్యులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మొక్కజొన్నలో అంతర పంటల పండించడం రైతన్నలకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావులు తెలిపారు. మండలంలోని రణస్థలం గ్రామంలో పెద్దింటి రాజేశ్వరి మొక్కజొన్నలో వేసిన అంతర పంటలు బెండ, చిక్కుడు, ముల్లంగి, సరిహద్దు పంటగా సజ్జలు వేయడాన్ని రాజస్థాన్ బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర పంటల వల్ల ఒక ఎకరానికి రూ. 8వేలు వరకు అదనంగా ఆర్జించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన, ద్రవ జీవామృతాలను ఉపయోగించడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గించవచ్చునని వివరించారు. అలాగే 15 సెంట్లు విస్తీర్ణంలో ఏటీఎం మోడల్‌లో వేసిన కూరగాయల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏలు గోవిందరెడ్డి, బాబాజీ, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ప్రశాంతంగా 'తప్పనిసరి పరీక్ష'



ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో శుక్రవారం జరిగిన నైతికత, మానవతా విలువల (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఇంటర్‌బోర్డు జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. అధికారులు శ్రీకాకుళం నగరంతోపాటు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ పరీక్షకు మొత్తం 19,979 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 19,754 మంది పరీక్ష రాశారు. జిల్లాలోని ఆయా జూనియర్ కళాశాలల్లో అక్కడి లెక్చరర్లే ఇన్విజిలేటర్లుగా వ్యవహరించగా.. సమీపంలోని కళాశాలల లెక్చరర్లు జవాబుపత్రాలకు వాల్యుయేషన్ చేసి మార్కులు కేటాయించారు. వాటిని జ్ఞానభూమి ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో ప్రిన్సిపాళ్లు అప్‌లోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

23న పర్యావరణ విద్య పరీక్ష

ఫస్టియర్ విద్యార్థులకు ఈనెల 23వ తేదీన పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పేరిట మరో తప్పనిసరి పరీక్ష జరగనుంది. ప్రథమ సంవత్సరం విద్యార్థులంతా ఈ పరీక్షకు విధిగా హాజరు కావడంతోపాటు ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ నెల 3వ తేదీన జరగాల్సిన ఈ పరీక్షను వివిధ కారణాలతో ఇంటర్‌బోర్డు 23వ తేదీకి వాయిదా వేసింది.

ఈ పరీక్షకు గతంలో గైర్హాజరైన/ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు కూడా వారివారి కాలేజీలకు హాజరై పరీక్ష రాయవచ్చని ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు సూచిస్తున్నారు. ఈ రెండు తప్పనిసరి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించకుంటే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పాస్ సర్టిఫికెట్లు జారీకావని ఆయన స్పష్టం చేశారు.

సైబర్ సెల్ సీఐగా టి.శ్రీనివాసరావు



సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలోని సోషల్ మీడియా సైబర్ సెల్ విభాగానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.శ్రీనివాసరావు శుక్రవారం విధుల్లో చేరారు. 2004 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు ఆర్ ఎస్ఐగా మొట్టమొదటి సారి విధుల్లో చేరి 2020లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది చింతపల్లిలో చేశారు. అనంతరం అనకాపల్లి ట్రాఫిక్‌లో చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయన స్వగ్రామం విజయనగరం జిల్లా గజపతినగరం. విధుల్లో చేరే ముందు ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

జాతీయ పురస్కారానికి ఇచ్ఛాపురం కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన యువచైతన్య వెల్ఫేర్, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్తంగా అందజేసే తెలుగు వెలుగు విశిష్ట కళారత్న జాతీయ పురస్కారానికి ఇచ్ఛాపురానికి చెందిన కళాకారులు ఎంపికయ్యారు. టి.బరంపురానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, నంది అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయరెడ్డి, ఆల్ ఇండియా కళా రంగం జిల్లా ఉపాధ్యక్షురాలు పెదిన ధనావతిలు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం హనుమకొండలో ఆదివారం జరగనున్న స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు ధనుంజయరెడ్డి, ధనావతిలు శుక్రవారం తెలిపారు.

అగ్ని ప్రమాదంలో నాలుగు షాపులు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న షాపులు

ఎల్ఎన్‌పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు షాపులు దగ్ధమయ్యాయి. గ్రామంలోని మార్కెట్ వీధిలో ఉన్న నడికుప్పల సింహాచలం (టైలరింగ్ షాపు), కోట్ని వైకుంఠరావు (ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్ షాపు), తాడివలస గురుమూర్తి (బార్బర్ షాపు), కొయ్యాన రాజు (మటన్, చికెన్ షాపు)లు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదానికి కారణం తెలియనప్పటికీ ఈ సంఘటనలో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసే ప్రయత్నాలు చేశారు. ఘటన సమాచారం తెలుసుకున్న ఆర్ఐ గవరయ్య, వీఆర్వోలు పార్వతి, రామప్పడు సంఘటనా స్థలానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకునికి తీవ్ర గాయాలు

మందస: మండలంలోని మూలిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తెలుకల గురుమూర్తికి శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చిన్న కుమారుడి వివాహానికి శుభలేఖలు పంచడానికి పెద్ద కుమారుడు జగన్నాథంతో బైక్‌పై వెళ్తున్న ఆయనకు ప్రమాదం జరిగింది. తల వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పెద్ద కుమారుడికి కూడా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, దడ్ల కిరణ్‌కుమార్, తెలుకుల సురేష్, దట్టి కోదండరావు, బైలాడుచైనీ ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు కృష్ణారావు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన బత్తిని కృష్ణారావు(55) శుక్రవారం పలాస రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారు. ఈయన విజయవాడలో కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. స్వగ్రామం వస్తున్న తరుణంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతునికి భార్య పార్వతి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కృష్ణారావు మృతిపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతిపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు, పార్టీ నాయకులు ఇరోతు హేమంత్, పుక్కళ్ల లక్ష్మణ్ సంతాపం తెలియజేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న వర్సిటీ నాన్‌టీచింగ్ స్టాఫ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ స్టాఫ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ (బోధనేతర) సిబ్బందికి 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు సర్వీస్ పెంచడంపై వీరు హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీ ఉద్యోగులకు సైతం న్యాయం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ యూనియన్ నాన్ టీచింగ్ స్టాఫ్ సెక్రటరీ వాళ్లే శ్రీరాములు నాయుడు, ఉద్యోగులు సత్యనారాయణ, రామకృష్ణ ప్రసాద్, మన్మధరావు, దుప్పల ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు



ఎస్పీ రాధికను కలిసిన పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన వివిధ హోదాల్లో గల పోలీసు అధికారులు ఎస్పీ జీఆర్ రాధికను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలను అందజేశారు. వీరిలో రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ గుండుమోను ఉమామహేశ్వరరావు, ఆమదాలవలస, జేఆర్‌పురం, ఎచ్చెర్ల, జలుమూరు, పొందూరు ఎస్ఐలు కె.వెంకటేష్, కె.గోవిందరావు, ఎస్.చిరంజీవి, కె.మధుసూదనరావు, వై.రవికుమార్‌లతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా ర్యాంకర్ ఎస్ఐ గోవిందరావులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని, ప్రజలకు పారదర్శక సేవలందించి ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు రాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

పీజీ మూడో సెమిస్టర్ స్పాట్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడో సెమిస్టర్ పీజీ స్పాట్ వాల్యుయేషన్ శుక్రవారం ప్రారంభించారు. మొదటి వాల్యుయేషన్, రెండో వాల్యుయేషన్ పది రోజుల పాటు నిర్వహించనున్నారు. మొత్తం 5800 పేపర్లు దిద్దనున్నారు. ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షిస్తున్నారు.